ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 09.06.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి జరిగే ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో బీఎల్‌వోలు, పర్యవేక్షకులకు తగిన భద్రత, సహకారం అందించాలని సంబంధిత అధికారులను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు.
2. వానాకాలం సీజన్ కోసం రాష్ట్రానికి 3.89 లక్షల టన్నుల యూరియా చేరిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.
3. మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో బత్తిని కుటుంబం ఆనవాయితీగా అందిస్తున్న చేప ప్రసాదం పంపిణీ కొనసాగుతోంది.
4. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. రెండు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించనున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది.

----------------------------

**ఎస్ఐఆర్**

రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి జరిగే ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో బీఎల్‌వోలు, పర్యవేక్షకులకు తగిన భద్రత, సహకారం అందించాలని సంబంధిత అధికారులను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ పోలీసు పెట్రోలింగ్‌కు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆయన సూచించారు.

**డెస్క్**

-----------------------------

**తుమ్మల**

వానాకాలం సీజన్ కోసం రాష్ట్రానికి 3.89 లక్షల టన్నుల యూరియా చేరిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. యూరియా లభ్యతపై నిన్న సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. రైతులకు న్యాయంగా, సకాలంలో ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వానాకాలం సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్రంతో సమన్వయం చేసుకుంటోందని, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి 6 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా రాష్ట్రానికి 3.89 లక్షల టన్నులు చేరిందని తెలిపారు.

**డెస్క్**

------------------------------

**చేప ప్రసాదం**

మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో బత్తిని కుటుంబం ఆనవాయితీగా అందిస్తున్న చేప ప్రసాదం పంపిణీ కొనసాగుతోంది. ఆస్తమా నివారణ కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది నాంపల్లికి వచ్చారు. నిన్న రాత్రి 9 గంటలకు ప్రారంభమైన ప్రసాదం పంపిణీ.. ఈరోజు రాత్రి 9 గంటల వరకు కొనసాగనుంది.

**పీటీసీ – హైదరాబాద్**

---------------------------

**ముఖ్యమంత్రి సభ**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో ఈ సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న మహిళా శక్తి మహా సభకు సర్వం సిద్ధమైంది. ఈ మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. మహిళా సంఘాల రుణ పరిమితిని 5

లక్షల నుండి 10 లక్షల రూపాయలకు పెంచుతూ కీలక ప్రకటన చేయనున్నారు. అలాగే, మహిళా సంఘాలకు 500 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను, ఆర్టీసీ అద్దె బస్సుల చార్జీల కింద 20 కోట్ల రూపాయల పైచిలుకు చెక్కులను పంపిణీ చేయనున్నారు.

**పీటీసీ – హైదరాబాద్**

-------------------------------

**ఉత్తమ్**

కృష్ణా, భీమా నదులపై కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ప్రతిపాదిస్తున్న బ్యారేజీలు, వంతెనలకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. నిన్న అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి.. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో విధించిన లక్ష్యాల అమలుపై దిశానిర్దేశం చేశారు.

**డెస్క్**

-------------------------------

**జూపల్లి**

రాష్ట్ర నూతన పర్యాటక విధానంలో భాగంగా తొలి దశలో తెలంగాణలో ఎంపిక చేసిన ఎనిమిది ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ఆకర్షణీయంగా అభివృద్ధి చేసేందుకు 'సమగ్ర మాస్టర్ ప్లాన్లు' రూపొందించాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందేలా... ఆయా ప్రాంతాలను తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

**డెస్క్**

-----------------------------------

**కిసాస్ సమ్మాన్ నిధి**

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి  పథకం నిధులు తనకు వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడ్డాయని  రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లబ్ధిదారు నక్క సంతోష్  చెప్పారు... ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ.....

**బైట్ - నక్క సంతోష్**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

---------------------------------

**నైరుతి**

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. సోమవారం రాష్ట్ర దక్షిణ సరిహద్దు జిల్లా జోగులాంబ గద్వాలను తాకాయి.  వచ్చే రెండు రోజుల్లో రాష్ట్రమంతటా రుతుపవనాలు విస్తరించనున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది. మరోవైపు ఉత్తర్‌ప్రదేశ్ నుంచి తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకు ఒక ద్రోణి కొనసాగుతోంది. రుతుపవనాల ప్రభావంతో ఈరోజు ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు.. ఇతర జిల్లాల్లో తేలికపాటి వానలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేసింది.

**డెస్క్**

------------------------------

**రేవంత్ రైతులు**

వాతావరణంలో వేగంగా వస్తున్న మార్పులు, కొన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయనే వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా అన్నదాతలు వానాకాలం సీజన్‌లో సాగుకు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. వ్యవసాయశాఖ సూచనలకు అనుగుణంగా పంటల మార్పిడి ద్వారా నేల సారం పెంచే.. దీర్ఘకాలంలో అధిక దిగుబడులు అందించే పంటలపై దృష్టిసారించాలన్నారు.

డెస్క్

----------------------------

**నైరుతి రుతుపవనాలు**

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తొలకరి జల్లులు పలకరించాయి. సోమవారం మృగశిర కార్తె రోజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది.

**పీటీసీ – నల్గొండ**

---------------------------

**వివేక్**

అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణ ప్రారంభమైందని మైనింగ్, కార్మిక, ఉపాధి కల్పనశాఖ మంత్రి గడ్డం వివేక్ తెలిపారు. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగానే విచారణ నిర్వహిస్తామని వెల్లడించారు.

డెస్క్

------------------------

**భట్టి పర్యటన**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈరోజు యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించనున్నారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా జిల్లాకు వస్తున్న ఆయన 14 కోట్ల రూపాయల పైచిలుకు విలువైన విద్యుత్ శాఖ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు.

**పీటీసీ – యదాద్రి భువనగిరి**

--------------------------

**మిషన్ వాత్సల్య పథకం**

మిషన్ వాత్సల్య పథకం కింద గ్రామాల్లో ఉన్న అర్ఫాన్, సెమీ ఆర్ఫాన్ పిల్లలను గుర్తించి అవసరమైన సహాయం అందించాలని కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్, బేటీ బచావో, బేటీ పడావో నోడల్ అధికారి అశ్విని వాకాడే అధికారులను ఆదేశించారు. ఈ పథకం సమీక్షలో బాలికల సంక్షేమం, విద్య కోసం నిధులను ఎలా వినియోగించాలనే విషయంపై చర్చించారు.

**పీటీసీ – కరీంనగర్**

-------------------------------

**పంట అవశేషాలు**

రైతులు పంటచేలలో పంట అవశేషాలను తగలబెట్టకుండా, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. నెక్కొండలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు.

**పీటీసీ - వరంగల్**

-------------------------------

**రాజన్న సిరిసిల్ల**

వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్ఈ వేణుమాధవ్ తెలిపారు. జిల్లాలోని ఏదైనా ఒక సబ్ స్టేషన్ లైన్ లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే, ఆధునిక ఇంటర్ంక్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**పీటీసీ - రాజన్న సిరిసిల్ల**

-------------------------------

**కలెక్టర్ కుమార్ దీపక్**

వానాకాలం వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని మంచిర్యాలజిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు.

**పీటీసీ - మంచిర్యాల**

----------------------------

**కలెక్టర్ ప్రతీక్ జైన్**

సంగారెడ్డి జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన జరుగుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలుపై అధికారులు ప్రజాప్రతినిధులు సమీక్షిస్తున్నారు. సమావేశానికి పార్లమెంటు సభ్యుడు ఎం రఘునందన్ రావు, జిల్లా ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ హాజరయ్యారు.

**పీటీసీ - సంగారెడ్డి**

---------------------------

**కలెక్టర్ చాహత్ బాజ్**

విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యా అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు.

**పీటీసీ -వరంగల్**

----------------------------

**చేపమందు పంపిణీ - మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రంలో మృగశిర కార్తె సందర్భంగా ఉబ్బసం, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ రోజు చేపమందు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

**పీటీసీ - మంచిర్యాల**

-------------------------------

**ఫార్మర్ రిజిస్ట్రేషన్**

వ్యవసాయ సమాచారాన్ని డిజిటలైజేషన్ చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అన్నదాతల సమగ్ర సమాచారాన్ని అన్ లైన్లో నిక్షిప్తం చేసేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేపట్టిందని నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి వినోద్ కుమార్ అన్నారు.

**పీటీసీ - నల్గొండ**

-------------------------------

**నీట్-2026**

ఈ నెల 21వ తేదీన నీట్-2026 ప్రవేశ పరీక్షలను ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు.

**పీటీసీ - వరంగల్**

--------------------------------